క్లుప్తంగా

కేటీసీలో డీడీఎంఎస్ తనిఖీ

టేకులపల్లి: డీడీఎంఎస్ (మైనింగ్) కమలేష్ కుమార్ వర్మ బుధవారం కోయగూడెం ఓపెన్ కాస్టులో తనిఖీ నిర్వహించారు. వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలను పరిశీలించారు. ఓసీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, రవాణా చేయాలని, కార్మికులు, అధికారులు రక్షణ చర్యలు తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి పంజాల శ్రీనివాస్, కేటీసీ మేనేజర్ సరబ్ సుమన్, రక్షణాధికారి కేఎస్ఎన్ రాజు, సర్వే అధికారి నరేష్ పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

జూలూరుపాడు: పడమటనర్సాపురం రైతు వేదికలో గురువారం ఉదయం 10 గంటలకు ఆయిల్ పామ్ సాగుపై రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ ఎస్.రఘుదీపిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న, కొత్తగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు టి.కరుణశ్రీ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి రైతులతోపాటు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ హాజరు కావాలని ఏఓ కోరారు.

బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధికి సత్కారం



మాధవరావును సత్కరిస్తున్న చైర్మన్ డీవీ, కౌన్సిలర్లు

ఇల్లెందు: జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావును మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కౌన్సిలర్లతో కలిసి బుధవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల మాధవరావుకు బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సయ్యద్ ఆజమ్, కటకం పద్మావతి, కోఆప్షన్ సభ్యుడు రబ్బానీ, ఆత్మకమిటీ అజ్మీర భావ్‌సింగ్ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, గుండా శ్రీకాంత్, వాసు, మెరుగు కార్తీక్‌యాదవ్, ఈశ్వర్, రవిశంకర్, సతీష్ , సుధాకర్ పాల్గొన్నారు.

పెద్దమ్మగుడి వద్ద దుకాణం ఖాళీ

పాల్వంచరూరల్: అద్దెగడువు ముగియడంతో పెద్దమ్మగుడి వద్ద ఒకటో నంబర్ కొబ్బరి కాయల దుకాణాన్ని బుధవారం ఖాళీ చేయించినట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయం సముదాయంలో మొత్తం ఆరు కొబ్బరికాయల దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు గడువు ముగిసింది. మిగిలిన దుకాణాల గడువు ముగిసినప్పటికీ ఈనెల 26న టెండర్లు నిర్వహిస్తున్నందున్న అప్పటి వరకు అద్దెలు చెల్లించడానికి వ్యాపారులు అంగీకరించడంతో యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాంబాబు

పాల్వంచరూరల్: పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని, రేషన్ దుకాణాల ద్వారా అన్ని సరుకులు పంపిణీ చేయాలని ప్రజాపంథా నాయకుడు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని దంతలబోరు ఎస్సీ కాలనీలో పీవైఎల్ మండల అధ్యక్షుడు నీలం భాస్కర్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీలకు రూ.600 చొప్పున చెల్లించాలని కోరారు. సమావేశంలో డి.వేణు, ఎస్.సుధాకర్, టి.రామారావు, కె.రాంబాబు, చంటి, శ్రీను, ఆదిలక్ష్మి, బి.వెంకటరమణ, ఎస్.బాయమ్మ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివి

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీల సేవలు వెలకట్టలేనివని గమన్ ఆస్పత్రి చైర్మన్ యర్రంశెట్టి నందాకిషోర్ అన్నారు. మండలంలోని పెద్దమ్మగుడి సమీపాన ఫంక్షన్ హాల్‌లో బుధవారం గ్రామీణ వైద్యులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందా కిషోర్ మాట్లాడారు. వైద్యులు ఆదిత్య, శ్రీహర్ష పలు అంశాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సింహులు, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లుతో పాటు పసునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టరూ..

- నిధులు మంజూరైనా పనుల ప్రారంభానికి గ్రహణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



సీతారామ కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టికట్ట

జూలూరుపాడు: గుండెపుడి–సురారం, జూలూరుపాడు శ్రీసాయిబాబా ఆలయం నుంచి వీరభద్రాపురం గ్రామాల మధ్య గల బీటీ రోడ్లు దెబ్బతినడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. జూలూరుపాడు శ్రీసాయిబాబా ఆలయం నుంచి వీరభద్రాపురం వరకు 2 కిలోమీటర్ల దూరం మేర రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అదేవిధంగా మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనం కన్పించే పరిస్థితి లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. వీరభద్రాపురం గ్రామ సమీపంలో సీతారామ ప్రాజెక్టు కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతోపాటు సురారం ప్రజలు మండల కేంద్రం జూలూరుపాడుకు రాకపోకలు కొనసాగించలేకపోతున్నారు. వీరభద్రాపురం గ్రామ సమీపంలో సీతారామ కాలువపై ఆగిపోయిన బ్రిడ్జి పనులు ఇటీవల తిరిగి ప్రారంభమయ్యాయి. అదేవిధంగా సురారం ప్రజలు వయా గుండెపుడి మీదుగా జూలూరుపాడు చేరుకోవాలన్నా వీరభద్రాపురం వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో కాలువపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి కట్టపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఒకవైపు బీటీ రోడ్లు అధ్వానం.., మరోవైపు కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో సురారం, గుండెపుడి, వీరభద్రాపురం గ్రామాల ప్రజలతోపాటు జూలూరుపాడు, వెంగన్నపాలెం రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గతుకుల రోడ్లపై రాత్రివేళల్లో బైక్, ఆటో, ట్రాలీ, కారు, లారీలు నడపడం కష్టతరంగా మారింది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మట్టి, కంకర, రాళ్లు, ఇసుకతో హెవీ లోడ్స్ టిప్పర్లు, లారీలు నిత్యం తిరగడంతో జూలూరుపాడు శ్రీసాయిబాబా ఆలయం నుంచి వీరభద్రాపురం వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతోపాటు, మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. 2022లో రెండు రహదారుల మరమ్మతుల రూ.2.29 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా ముగిసింది. అయినా పనుల ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. భేతాళపాడు–పడమటనర్సాపురం మధ్యగల బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.74 లక్షలు మంజూరు కాగా, టెండర్ ప్రక్రియ లేదు. అదేవిధంగా కొమ్ముగూడెం నుంచి కరివారిగూడెం వయా బాడవప్రోలు మధ్యగల బీటీ రోడ్డుకు రూ.33.68 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా.. టెండర్లు పూర్తయ్యాయి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



గుండెపుడి-సురారం మధ్య ప్రమాదకరంగా మూలమలుపులు

మలుపుల వద్ద ప్రమాదం



వీరభద్రాపురం నుంచి జూలూరుపాడు వరకు గల బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. రోడ్డంతా పూర్తిగా దెబ్బతిన్నది. అంతేకాకుండా మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నాం.

– కల్తి శేఖర్, వీరభద్రాపురం

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి



జూలూరుపాడు సాయిబాబా గుడి నుంచి వీరభద్రాపురం వరకు రోడ్డు బాగా దెబ్బతిన్నది. పంట పొలాలకు వెళ్లి రావాలంటే పగలు, రాత్రి వేళల్లో బైక్‌పై రావడమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావల్సి వస్తోంది. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– తాతా నరసింహారావు, జూలూరుపాడు

అధికారులు స్పందించాలి



సీతారామ కాలువపై బ్రిడ్జి నిర్మాణంతో నాలుగున్నరేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టికట్ట ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో మరింత ఇబ్బంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– బోడా నరసింహారావు, సురారం

గురుకుల కళాశాలలో యోగా



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి పాత కొత్తగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం యోగా నిర్వహించారు. శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ వారి ఆధ్వర్యంలో 'హర్ దిల్ ధ్యాన్ హర్ దిన్ ధ్యాన్'పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్ టి.మాధురి విద్యార్థినులతో ప్రాణాయామం, యోగముద్రలు, యోగాసనాలు చేయించారు. మెడిటేషన్ పర్యవేక్షకురాలు ఆర్.రమాదేవి, ఎస్.శివరాణి, బి.శశికళలు హృదయంపై ధ్యానం చేయుటలో మెళకువలు నేర్పించారు. వీటితో ఏకాగ్రత, సృజనాత్మకత, స్వీయ స్పృహ, విశ్రాంతి, ప్రశాంతమైన మనస్సును పొందటం వంటి లక్ష్యాలను సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ బి.విజయ, పీడీ శ్వేత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వలంటీర్స్ రమణ, వనిత, రమణి, ఉమామహేశ్వరీదేవి, వసంత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ తాగునీరు అందించాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో వారం రోజులుగా తీవ్ర మంచినీటి సమస్య నెలకొందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి బస్టాండ్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం ప్రాంగణంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ.. ప్రజలకు కనీసం తాగునీటి సమస్య కూడా పరిష్కరించలేని ఎమ్మెల్యే వనమా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోనే నీటి సమస్య ఈ విధంగా ఉంటే మారుమూల గ్రామాలలో పరిస్థితులను ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. గంధం మల్లికార్జున్‌రావు, గుడివాడ రాజేందర్, వీరు నాయక్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్ కుమార్

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం కార్డియోపల్మోనరీ రెసుసియేషన్ (సీపీఆర్), ఆటోమేటిక్ ఎక్టర్నల్ డిఫిబ్రిలేషన్(ఏఈడీ)పై రెవెన్యూ, పంచాయతీ, ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ సడెన్ కార్డియాక్ అరెస్ట్ (ఎస్‌సీఏ)కు మనిషి గురైనప్పుడు గుండె పనులు ఆకస్మికంగా కోల్పోవడం వల్ల శ్వాస ఆగిపోయి స్పృహ కోల్పోయినప్పుడు సీపీఆర్, ఏఈడీ చేయాలని తెలిపారు. సీపీఆర్ చేసిన తక్షణమే ఆ వ్యక్తికి సరైన వైద్యం అందించడం వల్ల బతికే అవకాశం ఉంటుందన్నారు. సడెన్ కార్డియాక్ అరెస్ట్ గుండెపోటుతో సమానం కాదు. గుండెలో కొంత భాగానికి రక్తం ప్రసరణ ఆగిపోయినప్పుడు గుండెపోటు వస్తుందన్నారు. సీపీఆర్ అత్యవసర వైద్యసేవలు(ఈఎంఎస్) అందే వరకు ముఖ్యమైన అవయవాలకు రక్తం సరఫరా అందుతుందన్నారు. పెద్దలు, పిల్లలు, శిశువులకు ఛాతిని నొక్కడం గురించి డాక్టర్ రాకేష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీఓ డి.రామారావు, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన



మాట్లాడుతున్న గోపాలరాజు

ఇల్లెందు: కార్మికుల భద్రతను పెంచేందుకు సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన అవసరం అని డీజీఎం గోపాలరావు తెలిపారు. బుధవారం ఇల్లెందులో గనులు, విభాగాల అధికారులకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. గోపాలరావు మాట్లాడుతూ.. ఇటీవల ఆస్ట్రేలియాలో అక్కడి సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తీసుకుని వాటిని ఇక్కడి పద్ధతులకు అనుగుణంగా అనుసరిస్తూ సింగరేణిలో భద్రతను పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, శేఖర్‌బాబు, కేటీసీ మేనేజర్ సుమన్, జేకే ఓసీ సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలి



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విజయలక్ష్మీనగర్ సర్పంచ్ కవిత, సిబ్బంది

ఇల్లెందురూరల్: చెత్త సేకరణ సమయంలోనే తడి, పొడి వేరు చేసేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఎంపీడీఓ అప్పారావు సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్–2లో భాగంగా సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి గతంలోనే రెండు బుట్టలు పంపిణీ చేశామని, ప్రజలు వాటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. గతంలో ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామని, ఆ సమయంలో రెండు గుంతలు తీయని వారి ఇళ్లను గుర్తించి ప్రస్తుతం మరో గుంత ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ సమయపాలన పాటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలించాలని చెప్పారు. అనంతరం శిక్షణ ధ్రువీకరణ పత్రాలను గ్రామపంచాయతీల వారీగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్పారావు, శిక్షకులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ బస్ పాస్ మేళా

టేకులపల్లి: మండలంలోని దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ చేసేందుకు గురువారం మేళా ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన శారీరక, మానసిక దివ్యాంగులతో బధిరులకు పాస్‌లు ఇస్తామని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, కలర్ ఫొటో, రూ.50తో టేకులపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే మేళాకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 90103 74644, 73828 58258 నంబర్లలో సంప్రదించాలని డీఎం తెలిపారు.

సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

పాల్వంచ: ప్రతిఒక్కరూ సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. వేసవిలో చలివేంద్రాలు ఎంతో అవసరమని, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఇలా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో చింతోజు బ్రహ్మారావు, ఎండీ.షాబుద్దీన్ ఖాన్, టి.కన్నయ్య, జానీమియా, జె.భిక్షం, సుందర్‌రావు, రాఘవేందర్‌రావు, మోహన్‌రెడ్డి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం గ్రామపంచాయతీ పరిధి దంతెలతండాకు చెందిన భూక్యా హరిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితిని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే హరిప్రియకు విన్నవించారు. స్పందించిన ఆమె సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. ఈమేరకు ఎల్ఓసీని హరిత కుటుంబ సభ్యులకు నాయకులు బుధవారం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, చీమల సత్యనారాయణ, లాల్‌సింగ్, అనిల్, లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.

దర్గాలో ఘనంగా ఇఫ్తార్ విందు



దుస్తులు అందజేస్తున్న తహసీల్దార్ అమ్జద్‌పాషా

టేకులపల్లి: బేతంపూడి దర్గాలో బుధవారం రాత్రి ఘనంగా ఇఫ్తార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టేకులపల్లి తహసీల్దార్ అమ్జద్‌పాషా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదముస్లింలకు ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎదళ్లపల్లి బాబు, ఎంపీటీసీ బాలకృష్ణ, కోఆప్షన్ మౌలానా, ఆర్ఐ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు, రామ, కిషన్, నరేష్, ఈది గణేష్ పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మూడోరోజు బుధవారం కొత్తగూడెం, పాల్వంచ, టేకులపల్లి మండల కేంద్రాల్లో తహసీల్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ... కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరికి వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి.

– సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): దీక్ష చేస్తున్న వీఓఏలు



పాల్వంచరూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలుపుతున్న గద్దల రమేష్



టేకులపల్లి: సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికులను పర్మనెంట్ చేయాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొర్రె వేణుగోపాల్ అన్నారు. బుధవారం కేటీపీఎస్ 7వ దశ గేటు వద్ద రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 6వ దశ నిర్మాణంలో ప్రాణాలు లెక్కచేయక కష్టపడి పనిచేసిన వారికి నేడు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వారికి ఉపాధి కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు వన్నాపురం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ఏ రవూఫ్, నాయిని శ్రీను, బానోతు రాము, తోట శ్రీను, వాసం రామకృష్ణ, పరకాల శ్రీనివాసరెడ్డి, వత్తిపర్తి రామరావు తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

టేకులపల్లి: గ్రామాల్లో నర్సరీలు, ఉపాధి హామీ పనులు, పల్లె ప్రకృతి వనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ విధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఎన్ని గంటలు పని చేస్తున్నారు. సిబ్బంది సహకారం ఎలా ఉంది. రోజు కూలి ఎంత వస్తోంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఎక్కువ వేతనం వచ్చేందుకు ఎక్కువ సమయం పని చేయాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొక్కలు చనిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నర్సరీ నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సర్పంచ్ ఎదళ్లపల్లి బాబు, ఏపీఓ కళంగి శ్రీనివాస్, కార్యదర్శి మీనాకుమారి, టీఏ చాంద్మల్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన నేత రామకృష్ణ రాజు



మాట్లాడుతున్న రాజు

టేకులపల్లి: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మాజీ ఆడిట్ కమిటీ కన్వీనర్, సీనియర్ నేత రాళ్లబండి రామకృష్ణ రాజు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన నాయకుడని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో రామకృష్ణ రాజు రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయులందరూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... అనీన తెలిసిన నేత కాబట్టే జిల్లా ఆర్థిక బాధ్యతలు ఆయనకు అప్పగించామన్నారు. ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల మీద అనేక సందర్భాలలో తన దగ్గరకు వచ్చి పరిష్కార మార్గాలు చూపే వారన్నారు. జిల్లా అధ్యక్షుడు భూక్యా కిశోర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నంది కృష్ణ మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరుగా రామకృష్ణరాజు మెలిగే వారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు వాసం వరలక్ష్మి, జిల్లా కోశాధికారి ఎస్‌వీ, జిల్లా కార్యదర్శులు హతీరామ్, పద్మారాణి, బిక్కు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగతాయి, బి.నరసింహారావు, మాన్‌సింగ్, జానకి, రాంజీ, రమేష్, రాంచందర్, నాగునాయక్, వీరన్న, తిరుపతి, రవి, కేవీ, సుజాత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

హెల్త్ సబ్‌సెంటర్‌కు మోక్షమెప్పుడో?

నేషనల్ రూరల్ హెల్త్ మిషన్(ఎన్ఆర్‌హెచ్ఎం) నిధులతో భేతాళపాడులో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం(పల్లె దవాఖాన) భవనం ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. రెండేళ్ల క్రితం రూ.16 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించగా.. ఇదే సమయాన నిర్మించిన గుండెపుడి, అనంతారం ఆర్యోగ ఉపకేంద్రాల భవనాలు ప్రారంభమయ్యాయి. కానీ భేతాళపాడు భవనం ప్రారంభం కాకపోవడంతో గ్రామపంచాయతీలోనే హెల్త్ సెంటర్‌ను కొనసాగిస్తుండగా ప్రజలతోపాటు, వైద్యసిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

– జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : వెంకటనాగప్రసాద్, ఐటీడీఏ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 81425 74999